శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## నారా లోకేష్ కు స్వాగతం పలికిన అబ్దుల్ అజీజ్



**నెల్లూరు, జులై 6, ప్రభాతవార్త- వైద్యం** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ కు రేణిగుంట విమానాశ్రయంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ స్వాగతం పలికారు. అనంతరం నారా లోకేష్ తో కలిసి నెల్లూరు పయనమయ్యారు.

## ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అణుగుణంగా కూటమి ప్రభుత్వం : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి





**సంగం జులై 6 ప్రభాతవార్త** సంగం మండలం కోలగట్ల గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొని ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అణుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. ఎన్డిఎ కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో తొలి అడుగు పూర్తి చేసుకుందని అన్నారు. ఎన్నికల హామిలో భాగంగా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామిలను కూటమి ప్రభుత్వం చిత్త శుద్దితో ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని అన్నారు. ఇచ్చిన హామి ప్రకారం రికార్డు స్దాయిలో తల్లికి వందనం నిధులను తల్లుల ఖాతాలకు జమ చేసిందని అన్నారు. ప్రజలు మాపైన పెట్టుకున్న నమ్మకాన్ని నిలుపుకున్నామని చెప్పారు. ఆత్మకూరు నియోజకర్గం పరిధిలో 27124 మంది విద్యార్ధుల తల్లుల ఖాతాలో 13 వేల రూపాయాలు జమ చేసినట్లు తెలిపారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామిలు అమలు చేయనున్నట్లు చెప్పారు. అడబిడ్డ నిది పథకాన్ని కూడా అమలు చేసేందుకు సిఎం కృషి చేస్తున్నారని అన్నారు. ఆత్మకూరు నియోజకవర్గం పరిధిలో సిసి రోడ్లు, సైడు కాలువలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలానికి 15 కోట్లు చొప్పున నియోజకవర్గంలో ఆరు మండలాలకు 90 కోట్లు కావాలని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కోరినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా కోలగట్ల గ్రామంలోని నాగవరపమ్మ తల్లి ఆలయాన్ని మంత్రి దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆలయ విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎన్డిసిసిబి బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, తాళ్లూరు గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, టిడిపి మండలాధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి, గుండ్లపల్లి శ్రీనివాసులుయాదవ్, వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, కోటు కరుణాకర్‌రెడ్డి, సంగం, అన్నారెడ్డిపాళెం నీటి సంఘం అద్యక్షులు సూరా శ్రీనివాసులురెడ్డి, పగడాల రఘురామయ్య, రాధారెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, శ్రీదర్ తదితరులు పాల్గోన్నారు.

## యాచకుల పిల్లలు బడిబాట పట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ ఆదేశం



**నెల్లూరు, జులై 6, ప్రభాతవార్త -వైద్యం** ప్రాధమిక విద్యకు దూరంగా.. రోడ్డు పక్కన యాచకులుగా ఉంటూ కాలం గడుపుతున్న చిన్నారులను గుర్తించి.. వారిని పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో బడికి వెళ్లకుండా తల్లిదండ్రులతో యాచక వృత్తిని కొనసాగిస్తున్న వారిని గుర్తించాలని సచివాలయ సిబ్బందికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. చదువు ప్రాధాన్యతను వారికి వివరించి.. స్కూళ్లో చేర్పించాలని సూచించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఇవాల్టి నుండి సిటీ నియోజకవర్గంలో బడి ఈడు పిల్లలు బడికి వెళ్లేలా చూడాలన్నారు. బాల కార్మికులను సైతం గుర్తించాలని ఆదేశించారు. బడికి వెళ్లకుండా రోడ్డు పక్కన యాచకులను ఆదేశించారు. బడికి వెళ్లకుండా రోడ్డు పక్కన యాచకులుగా ఉంటున్న చిన్నారులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని.. వారిని బడికి పంపే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని మంత్రి నారాయణ సూచించారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

- 10న జిల్లా వ్యాప్తంగా నిర్వహణ తల్లిదండ్రులు తప్పకుండా పాల్గొనాలి
- జిల్లా కలెక్టర్ ఆనంద్ పిలుపు



**నెల్లూరు కలెక్టరేట్, జులై 6, ప్రభాతవార్త** జిల్లా వ్యాప్తంగా 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఒకసారి ఈ మీటింగ్‌ను నిర్వహించామని, రెండోసారి ఈనెల 10న జిల్లావ్యాప్తంగా 36 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మీటింగ్ రోజున విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, విద్యార్థుల బోధన సామర్థ్యాలను వారికి ఉపాధ్యాయులు తెలియజేస్తారన్నారు. విద్యార్థుల ప్రతిభను తెలిపే ప్రోగ్రెస్ కార్డులను కూడా అందిస్తారని చెప్పారు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారు. పాఠశాలలో క్రమశిక్షణతో ఉంటున్నారా, ఏయే సబ్జెక్టుల్లో వెనకబడి ఉన్నారు. మొదలైన అంశాలను తల్లిదండ్రులకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు, విద్యార్థులతో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లాలో సుమారు మూడున్నర లక్షల మంది విద్యార్థులు మన విద్యా వ్యవస్థలో విద్యను అభ్యసిస్తున్నారని, వారి ప్రతిభ పాటవాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పకుండా ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. అన్ని పాఠశాలల్లో హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

## ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలంటే చదువే మార్గం

మేయర్ స్రవంతిజయవర్ధన్



**నెల్లూరు కార్పొరేషన్ జులై 6 ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలోని బివి నగర్ ప్రాంతంలో ఉన్న గిరిజన భవన్ లో అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ,ఏకలవ్య ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన గిరిజన విద్యార్థుల ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కలెక్టర్ వై ఓ.ఆనంద్, నగర మేయర్ స్రవంతిజయవర్ధన్ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ సమాజంలో విద్యకు ఎంత ప్రాధాన్యం ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు అని అన్నారు. విద్య మనకు సంస్కారం నేర్పిస్తుంది, విద్య మనకు జీవన శైలిని నేర్పిస్తుంది అని తెలియజేశారు. విద్య వల్ల సమాజంలో గౌరవం లభిస్తుంది అని తెలిపారు. మనం ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే చదువే మార్గం అని తెలిపారు. గిరిజన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించి ప్రోత్సాహించే ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్, ఏక లవ్య ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న నిర్వాహకులు బషీర్ వేణుకు ధన్యవాదాలు తెలియజే శారు. ఇలాంటి కార్యక్రమాలు ఇంకా నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. గిరిజన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాం క్షించారు. గిరిజన విద్యార్థులకు ఎటువంటి అవసరం వచ్చిన ముందు ఉంటామని తెలియజేశారు.

## భక్తుల సంతృప్తే ప్రధాన లక్ష్యం

- భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడండి
- పక్కాగా ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, జులై 6, ప్రభాతవార్త** సుదూర ప్రాంతాల నుంచి రొట్టెల పండుగకు విచ్చేసే భక్తుల సంతృప్తే ప్రధాన లక్ష్యంగా పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం బారాషహీద్ దర్గా ప్రాంగణంలో రొట్టెల పండుగ ఏర్పాట్లను కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ అధికారులతో కలిసి పరిశీలించారు. దర్గా ప్రాంగణంలోని పోలీస్ కంట్రోల్ రూమ్, స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేలాదిగా తరలివస్తున్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తుందని చెప్పారు. సిబ్బంది అందరూ తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధులను ఎటువంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలని సూచించారు. అన్ని శాఖల హెచ్ ఓ డి లు నిరంతరం అందుబాటులో ఉంటూ ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. క్యూలైన్ల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, త్వరితగతిన దర్శనం చేయించేలా చూడాలన్నారు. దర్గాకు వచ్చిన భక్తులందరూ సంతృప్తిగా దర్శనం చేసుకుని ప్రశాంతంగా తిరిగి వెళ్లడమే లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ సింధు ప్రియ, జిల్లాస్థాయి అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 150 ఏళ్ల చరిత్ర ఉన్న వీఆర్ హైస్కూల్‌కు పూర్వ వైభవం

- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా పునఃప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం
- పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించడమే లక్ష్యమన్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- పేద విద్యార్థుల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూల్ సిద్ధం చేయడం ఓ చరిత్ర..రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్
- మంత్రి నారాయణ పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది.. మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి
- వీఆర్ హైస్కూల్‌ను దేశంలోనే రోడల్ మోడల్‌గా చేయడం నాన్న గారి సంకల్పం.. మంత్రి నారాయణ కుమార్తె షరణి
- వీఆర్ హైస్కూల్లో ప్రారంభోత్సవానికి శరవేగంగా జరుగుతున్న పనులనుపరిశీలించిన మంత్రి నారాయణ





**నెల్లూరు, జులై 6, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరులో అత్యద్భుతంగా అధునాతన టెక్నాలజీతో రూపుదిద్దుకున్న వీఆర్ హైస్కూల్ ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఈ మేరకు జరుగుతున్న ప్రారంభోత్సవ పనులను తన కుమార్తె షరణితో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, ముక్య నేతలు వీఆర్ హైస్కూల్‌ను పరిశీలించి మంత్రి నారాయణ కమిట్‌మెంట్ పట్ల అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ 1875లో వీఆర్ హైస్కూల్‌ని ప్రారంభించారన్నారు. తన విద్యాభ్యాంస ఇక్కడే జరిగిందని గుర్తు చేసుకున్నారు. 150 ఏళ్ల చరిత్ర ఉన్న వీఆర్సీని వైఎస్సార్‌సీపీ మూసేసిందని మండిపడ్డారు. శిథిలావస్థకు చేరిన స్కూల్‌ని చూసి బాధపడ్డానన్నారు. పూర్వ వైభవం కల్పించాలని అప్పుడే సంకల్పించానన్నారు. ఇందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అనుమతి తీసుకున్నానని తెలిపారు. ఎన్సీసీ, నారాయణ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆధునీకరణ పనులు ప్రారంభించామని చెప్పారు. నా కూతురు షరణి, ఎన్సీసీ సిబ్బంది స్కూల్‌ని అద్భుతంగా తీర్చిదిద్దారని అభినందించారు. పేద పిల్లల కోసం డిజిటల్ విద్యను సిద్ధం చేశారన్నారు. ఈ క్రమంలో వీఆర్ హైస్కూల్‌లో సిటు కోసం ఐదు వేల మంది దరఖాస్తు చేశారని చెప్పారు. ఒకే రోజులో 1050 మంది నిరుపేద పిల్లలకు సీట్లు కేటాయించామన్నారు. రవాణా కోసం పది బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ ఉచితంగా ఇస్తామన్నారు. ప్రభుత్వం రెండు జతల యూనిఫాం ఇస్తుందని, దానికి తోడుగా నారాయణ సంస్థల నుంచి నాలుగు జతల ఇస్తున్నామని మంత్రి తెలియజేశారు. దగ్గరలో ఉన్న హైస్కూల్ పిల్లలకు సైకిల్ కూడా ఉచితంగా ఇస్తామన్నారు. నెల్లూరులో ఉన్న అన్ని స్కూల్స్‌ని నాలుగేళ్లలో వీఆర్సీ తరహాలో సిద్ధం చేస్తామని మాటిచ్చారు. ఈ క్రమంలో డీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు రెండు స్కూల్స్ దత్తత తీసుకున్నారని తెలిపారు. సంతపేట మోడల్ స్కూల్ గుంటబడిలో పనులు జరుగుతున్నాయన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికల్లా 14 హైస్కూల్స్‌ని ఆధునీకరిస్తామని తెలిపారు. అడగగానే అనుమతిచ్చి, సిబ్బందిని కేటాయించిన మంత్రి నారా లోకేష్‌కి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

**రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్** మాట్లాడుతూ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పుకి వీఆర్సీ ఓ నిదర్శనం అన్నారు. ప్రభుత్వ పాఠశాల ఇలా ఉంటుందని కలలో కూడా ఊహించలేదని చెప్పారు. వీఆర్సీని చూస్తే ఇలాంటి స్కూల్‌లో మేము చదవలేకపోయాం అని అసూయ వేస్తోందన్నారు. వీఆర్సీ కోసం నారాయణ సార్ చేసిన కృషి కళ్ళముందు సాక్షాత్కరిస్తోందని తెలియజేశారు. పేద పిల్లల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూల్ సిద్ధం చేయటం ఓ చరిత్ర అని కొనియాడారు. నారాయణ సార్ సంకల్పం నెల్లూరులోని నిరుపేద పిల్లల బంగారు భవిష్యత్తుకి బాటలు వేస్తుందన్నారు. నారాయణ సార్ ప్రేరేపణతో ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు వస్తున్నారని తెలియజేశారు.

**మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి** మాట్లాడుతూ వీఆర్ హైస్కూల్‌ని అద్భుతంగా తీర్చిదిద్దిన మంత్రికి అభినందనలు తెలిపారు. పేద పిల్లల కోసం మంత్రి నారాయణ సంకల్పం చాలా గొప్పదని కొనియాడారు. తండ్రి తలపెట్టిన మహాయజ్ఞంలో పాలుపంచుకున్న షరణికి అభినందనలు తెలియజేశారు. కార్పొరేట్ స్కూల్స్‌ని తలదన్నేలా వీఆర్సీ ని తీర్చిదిద్దారని అభినందించారు. తరగతి గదులు అద్భుతంగా సిద్ధం చేశారన్నారు. నారాయణ సార్ తీసుకున్న నిర్ణయం శాశ్వతమైందని కొనియాడారు. దీంతో మంత్రి నారాయణ పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు.

**పొంగూరు షరణి మాట్లాడుతూ** వీఆర్ హైస్కూల్‌ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రేపు ప్రారంభిస్తారన్నారు. వీఆర్ హైస్కూల్‌ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని నాన్న గారు సంకల్పించారని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూల్ సిద్ధమైందన్నారు. నాన్న కల సాకారం అయిందని తెలిపారు. అందరికి అవకాశం కల్పించలేకపోయామని చెప్పారు. ఒకే రోజులోనే అడ్మిషన్‌లు పూర్తయ్యాయని తెలిపారు. పిల్లలని ఆకర్షించే విధంగా అధునాతన క్రీడా పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్నేషనల్ స్కూల్స్‌ని కరికులం ఇక్కడ అమలు చేస్తున్నామని తెలిపారు. స్కూల్ ఆధునికరణలతో నా భాగస్వామ్యం ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, రాష్ట్రమైనార్టీ సెల్ అధ్యక్షులు నన్నేసాహెబ్, ప్రిన్సిపాల్ వెంకటరావు, ఎంఈఓ తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమానికి చిరునామా చంద్రబాబు పాలన : ఎమ్మెల్యే





**బుచ్చి జులై 6 ప్రభాతవార్త** అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా చంద్రబాబుపాలన అని కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుచ్చి రెడ్డిపాళెం మండలంలోని రేబాల నెహ్రునగర్ కాలనీ, ప్రగతి నగర్ కాలనీలో ఆమె సుపరిపాల నలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రజలు ఏ సమస్య వున్న తన దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. ఐదేళ్ళుగా వ్యవస్థలన్ని నిర్వీర్యం అయ్యాయని ఆమె విమర్శించారు. కూటమి ప్రభుత్వం అదికారంలోకి వచ్చిన తరువాత వృద్దాప్య పెన్షన్ 4 వేలు, మానవతా దృక్పధంతో దివ్యాంగుల పెన్షన్‌రెట్టింపు చేసి 6 వేలకు పెంపు, ఆగష్టు నుండి మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం, మెగా డిఎస్‌సి ఘనత కూటమి ప్రభుత్వాని కి దక్కిందని అన్నారు. రేబాల పంచాయితీలో సుమారు 30 లక్షలతో సిసి రోడ్లు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సీనియర్ టిడిపినాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఏటూరు శివరామకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, సర్పంచ్ లఘంతోటి బాగ్యమ్మ, రూరల్ అద్యక్షులు బెజవాడ జగదీష్, బత్తల హరి కృష్ణా, నెల్లూరు రమణారెడ్డి, లఘంతోటి మస్తాన య్య, బి.మురళీకృష్ణా, వింజం మహేష్‌నాయుడు, తమ్మిరెడ్డి మల్లికార్జున, రజినీకాంత్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

# రొట్టెల పండగకు తొలిరోజు భక్తుల రద్దీ

- సుమారు 2 లక్షల మందికి పైగా విచ్చేసిన భక్తులు
- 30 వేల మందికి పైగా భక్తులకు ఉచిత అన్నదానం
- పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర సేవలు
- పటిష్ట పోలీసు బందోబస్తు పక్కాగా ఏర్పాట్లు
- సంతృప్తి వ్యక్తం చేసిన భక్తులు
- ప్రశాంత వాతావరణంలో రొట్టెలు మార్చుకున్న భక్తులు







**నెల్లూరు కలెక్టరేట్, జులై 6, ప్రభాతవార్త** నెల్లూరు బారాషహీద్ దర్గాలో ప్రారంభమైన రొట్టెల పండుగకు తొలి రోజు భక్తులు భారీగా తరలివచ్చారు. సుమారు రెండు లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం, కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి.

– పటిష్ట బందోబస్తు దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీస్ అవుట్ పోస్ట్ ద్వారా అనౌన్స్మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకుంటున్న భక్తులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేక వైద్యులను, సిబ్బందిని బ్యాచ్‌ల వారీగా నియమించి 24 గంటలూ భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. మొదటిరోజు సుమారు 500 మంది పైగా భక్తులకు బిపి, రక్త పరీక్షలు, మందులు అందజేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత తెలిపారు.

భక్తులందరికీ అన్నదానం రొట్టెల పండుగకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉచిత అన్నదానాన్ని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు అందిస్తున్నారు. తొలిరోజు సుమారు 30 వేలకు మందికి పైగా భక్తులకు అన్నదానం చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే భక్తులకు స్వచ్ఛమైన తాగునీటిని స్టాల్స్ ఏర్పాటు చేసి మున్సిపల్ అధికారులు అందజేస్తున్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది సేవలు భేష్ దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదరాన్ని తొలగిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా శుభ్రపరుస్తున్నారు. దీంతో దర్గా పరిసరాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చైతన్య ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

### అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ

స్వర్ణాల చెరువులో ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. 24 గంటలు అప్రమత్తంగా బోట్లు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచారు. దర్గా ఆవరణలో అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచారు.

### ప్రత్యేకంగా మీడియా పాయింట్

రొట్టెల పండుగ కవరేజ్ నిమిత్తం దర్గాకు విచ్చేస్తున్న మీడియా వారికి ప్రత్యేకంగా జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో మీడియా పాయింట్‌ను మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. పాత్రికేయులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఈ కేంద్రం నుంచి తమ విధులు నిర్వహిస్తూ రొట్టెల పండుగ విశేషాలను, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందిస్తున్నారు. మీడియా వారికి ప్రత్యేకంగా అల్పాహారం, భోజన సౌకర్యాలు కల్పించారు.

# దొంగతనం కేసులో ముద్దాయి అరెస్ట్

– 34 గ్రాముల బంగారం స్వాధీనం



**నెల్లూరు క్రైమ్, జూలై 6 ప్రభాతవార్త :** కుటుంబ సభ్యులు బయట మాట్లాడు కుంటుండగా ఇంట్లో దూరి దొంగతనం చేసిన ముద్దాయిని వేదయపాలెం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక వెంగళరావు నగర్ ఏ బ్లాక్ కు చెందిన ఉండు బోయిన వెంకటేశ్వర్లు, కొండమ్మ దంపతులు గత నెల 28వ తేదీ ఇంటి బయట మాట్లాడుకుంటూ ఉండగా చాచు గణపతి అలియాస్ మడపర్తి గణపతి అనే వ్యక్తి వారి ఇంట్లోకి అక్రమంగా చొరబడి ఇంట్లో బీరువాలోని లాకర్లో ఉంచిన బంగారు ఆభరణాలను దొంగిలించుకు వెళ్లాడు. ఈ సంఘటనపై అదే రోజు బాధితుల నుండి ఫిర్యాదు అందుకున్న వేదయపాలెం సిఐ కె శ్రీనివాసరావు తన పర్యవేక్షణలో ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఇతర సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం ముద్దాయి గణపతిని వేదయపాలెం పోలీసులు స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. అతని వద్ద నుండి 34 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిఐ శ్రీనివాసరావు, ఎస్సై విజయ్ కుమార్‌లను జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్, నగర డిఎస్పి సింధు ప్రియలు ప్రత్యేకంగా అభి నందించారు.

# ఉద్యమాలను ముందుండి నడిపిన మాతృసంఘం "ఎస్‌టియు"



**కావలిరూరల్, జులై 6 ప్రభాతవార్త :** ఎన్నోరకాలు ఉద్యమాలను ముందుండి నడిపించిన మాతృసంఘం ఎస్‌టియు అని ఎస్‌టియు రాష్ట్రప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి తెలియచేశారు. కావలి పట్టణంలోని ఎస్‌టియు కార్యాలయంలో జిల్లా అద్యక్షులు వై.అశోక్‌బాబు అధ్యక్షతన ఆదివారం కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రప్రధానకార్యదర్శి మల్లు రగునాథరెడ్డి మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వమే 1947 జూన్ 9వ తేదీన ఆవిర్భవించింది మొదలు ఈ నాటివరకు ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమమే ధ్యేయంగా ఎస్‌టియు పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వంపై పోరాడి సాధించుకున్న ఎన్నో రకాల ప్రయోజనాలకు నేటి ప్రభుత్వాలు తూట్లు పొడిచేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే పిఆర్‌సి ప్రకటించి 30శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ప్రకటించకపోతే ఉద్యమం తప్పదన్నారు. రాష్ట్రఅదనపు ప్రధానకార్యదర్శి పి.రమణారెడ్డి మాట్లాడారు. 11వ పిఆర్‌సి గడువు ముగిసి 2 సంవత్సరాలు కావస్తున్నప్పటికి నేటికి కూడా పిఆర్‌సి కమీషన్‌ను నియమించకపోవడం, మధ్యంతర భృతి ప్రకటించకపోవడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డి.ఎలను ప్రకటించాలని, 11వ పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పదవీవిరమణ చెందిన ఉద్యోగ ఉపాధ్యాయుల గ్రాట్యూటి, ఆఫ్ పే లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. సమస్యల పరిష్కారంలో ఇలానే మొండిగా వ్యవహరిస్తే భారీ ఉద్యమానికి శ్రీకారం చుట్టక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కుడుముల ప్రసాద్‌ను ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సుదర్శనం, మాల్యాద్రి, కె.రాజ్‌కుమార్, ఎ.రాజు, వై.సురేష్, ఎ.రామారావు, సునీల్, రవి, ఏసుదాసు, కాంతారావు, వెంగళరావు మరియు వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

# దేశ సమైక్యత, సమగ్రతా సాధకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జి



**కావలిరూరల్, జులై 6 ప్రభాతవార్త :** దేశ సమైక్యత, దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం పాటుపడిన మహానేత, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జి అని పలువురు బిజెపి నాయకులు తెలియచేశారు. భారతీయ జనతాపార్టీ కావలి పట్టణఖాఖ ఆధ్వర్యంలో పట్టణ అద్యక్షులు మంద కిరణ్ అధ్యక్షతన ఆదివారం పార్టీ కార్యాలయంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడారు. 1901 జులై 6వ తేదీన అసుతోష్ ముఖర్జి, రాణీ జోగ్మయాదేవిల పుణ్యదంపతులకు శ్యాంప్రసాద్ ముఖర్జి జన్మించారన్నారు. "ఏక్ దేశ్ మే దో ప్రధాన్, దో నిశాన్, దో విధాన్ నహీ చలేగా నహీ చెలాగా" అంటూ ఆర్టికల్ 370ని రద్దుకోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని జనసంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. జనసంఘ్ వ్యవస్థాపక అద్యక్షులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జి నడిపించిన బాటలో బిజెపి పయనిస్తుందని తెలియచేశారు. ఆయన జీవితం దేశప్రజలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆలోచనా విధానాలు ముందుచూపుకు నిదర్శనమని తెలియచేశారు. దేశంలో ఒకే పౌరసత్వం, కాశ్మీర్‌లో అవరోధంగా ఉన్న ఆర్టికల్ 370 రద్దుకోసం శ్యాంప్రసాద్ ముఖర్జి తీవ్రంగా కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, వింత రంగారెడ్డి, సివిసి సత్యం, అమరా వెంకటసుబ్బారావు, మద్దిశెట్టి నరేంద్ర, బెహరా లక్ష్మినారాయణ, పంది మధుసూధన్‌రావు, కూరాకుల సవీంద్ర, ముంగమూరి వెంకట్‌రెడ్డి, మట్టా మల్లికార్జున, వల్లపు తిరుపతయ్య, మొక్క మాల్యాద్రి, పసుపులేటి సుధాకర్, దేవాండ్ల రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం



**అల్లూరు,జులై 6 ప్రభాతవార్త :** ప్రపంచ జూనో సిస్ దినోత్సవం సందర్భంగా అల్లూరు పశువైద్య కేంద్రం నందు ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ ఎడీ డాక్టర్ పరమేశ్వర్ మాట్లాడుతూ ప్రపంచ జోనోసిస్ దినోత్సవం సందర్భంగా పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జంతు ప్రేమికులు తీసుకోని వచ్చిన సుమారు 75 కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ టీకాలు ను చేయటం జరిగిందని. ఈ టీకాలు క్రమం తప్పకుండా జంతువులకు వేయటం వల్ల జంతువుల నుంచి మనుషులకు లేదా మనుషుల నుండి జంతువులకు సంక్రమించే వ్యాధులను అరికట్టవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జంతు ప్రేమికులు పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు జడ్‌పిటిసి పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ



**ఆత్మకూరు జులై 6 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని పలు పంచాయితీలలో గల కాలనీలలో ప్రజలకు త్రాగునీటి సమస్య లను పరిష్కరించేందుకు జిల్లా పరిషత్ నిధులు ద్వారా 10 బోర్లు మంజూరు చేయించడం జరిగిందని ఆత్మకూరు జడ్‌పిటిసి సభ్యురాలు వైఎస్ఆర్ సిపి ఆత్మకూరు నియోజకవర్గ మహిళా అద్యక్షురాలు ప్రసన్న లక్ష్మీ పేర్కొన్నారు. ఆత్మకూరు మండలం నల్లపరెడ్డిపల్లి,కనుపూరుపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు ద్వారా మంజూరు అయిన బోరు ఏర్పాటును ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్బంగా ప్రసన్న లక్ష్మీ మాట్లాడుతు జిల్లా పరిషత్ నిధులు మంజూరు చేయించినందుకు జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో మండలంలోని బోయిల చిరువెళ్ళ జంగాలపల్లి ,మహిమలూరు, పమిడిపాడు, ఆరవీడు, నల్లపరెడ్డిపల్లి,వాశిలి, బట్టేపాడు, అప్పారావుపాళెం, కనుపూరుపల్లి పంచాయితీలలో అవసరమైన ఈ ప్రాంతాల్లో బోర్లును ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్బంగా ఆమె మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు బోడ్డు సుహాసిని, సర్పంచులు దొడ్ల శ్రీదేవమ్మ, రాచగొర్ల ఆది లక్ష్మమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈ సుదర్శన్, పంచాయితీరాజ్ నియోజకవర్గ అద్యక్షులు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, పెంచలరెడ్డి,సుధాకర్‌రెడ్డి, దొడ్ల వెంకురెడ్డి, రాచగొర్ల శంకరయ్య, ఎర్రగుంట్ల పెంచలయ్య, చంద్రప్రసాద్, శీనయ్య, కనకాద్రి, ప్రాణం పెంచలయ్య, వినయ్ తదితరులు పాల్గోన్నారు.

# జిల్లా చరిత్రలో మంత్రి నారాయణ సార్ పేరు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుంది



**- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**
**- వీఆర్సీ పాఠశాలను మంత్రితో పాటు కలిసి పరిశీలించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**
**- చదువుల తల్లి కలల స్వర్గంగా మార్చేందుకు మంత్రి నారాయణ కృషి ఎనలేనిది**
**- ఇలాంటి పాఠశాలను భారతదేశంలోనే సాధ్యం కానిది నారాయణ సార్ సాధించారు**
**- మంత్రి నారాయణ సార్ జన్మ ధన్యమైందని కోటంరెడ్డి వెల్లడి**

**నెల్లూరు, జులై 6 ,ప్రభాతవార్త-వైద్యం** జిల్లా చరిత్రలో మంత్రి నారాయణ పేరు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నెల్లూరులో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన సందర్భంగా వీఆర్సీ లో జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణతో పాటు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ నేపథ్యంలో వీఆర్సీ పాఠశాలను ఆధునీకరించిన తర్వాత తొలిసారి ఎమ్మెల్యే కోటంరెడ్డి విచ్చేశారు. మంత్రితో కలిసి క్రీడా మైదానాన్ని తరగతి గదులు, అధునాతన ల్యాబ్‌లను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఘన చరిత్ర కలిగిన వీఆర్సీ హైస్కూల్ దీనస్థితిలోకి వెళ్లిపోయిందని, వీఆర్సీని చదువుల తల్లి కలల స్వర్గంగా మార్చేందుకు మంత్రి నారాయణ చేసిన కృషి అభినందనీయమన్నారు. తన కుమార్తె షరిణికి బాధ్యతలు అప్పగించి అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. నేను చదివిన వీఆర్సీ ఇంత గొప్పగా రూపుదిద్దుకొంటుందని అసలు ఊహించలేదని అన్నారు. భారతదేశంలో ఎక్కడా ప్రభుత్వ స్కూల్స్‌లో సాధ్యం కానిది నారాయణ సార్ సాధించారని హర్షం వ్యక్తం చేశారు. అసాధ్యాన్ని సాధ్యం చేసిన మంత్రి నారాయణని రాజకీయాలకు అతీతంగా అందరూ అభినందించాల్సిందేనని తెలిపారు. ధనవంతులు, పూర్వ విద్యార్థులు ఈ స్కూల్‌ని సందర్శించాలని అప్పుడే మరికొన్ని స్కూల్స్ రూపురేఖలు మారుతాయన్నారు. నారాయణ సార్ జన్మ ధన్యమైందన్నారు. రాజకీయాల్లో అతికొద్దిమందికి ఇలాంటి అవకాశాలు వస్తాయని, ఇలాంటి అవకాశాన్ని సార్ సద్వినియో గం చేసుకున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని స్కూల్స్‌ని వీఆర్సీ తరహాలో సిద్ధం చేస్తామన్న మంత్రి సంకల్పం నెరవేరాలన్నారు. ఈ కార్యక్రమం లో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, కమీషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# చేజర్లలో భక్తిశ్రద్దలతో మొహరం వేడుకలు



**చేజర్ల, జులై 6 ,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన చేజర్లలో మొహరం షరగత్ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్దలతో నిర్వహించారు. పీర్లను మేళ తాళాలతో ఊరేగింపుగా గ్రామంలో అన్ని వీధులలో ఉత్సవం నిర్వహించారు. మొహరం వేడుకలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఈ కార్యక్రమం వైభవంగా ముగిసింది. ఈ కార్య క్రమంలో దర్గా కమిటీ సభ్యులు షేక్ నజీర్, షేక్ మహమ్మద్ అలీ, షేక్ నజీర్, షేక్ రఫీ ఉన్నారు.

# గరుడవాహన సేవలో పాండురంగడు



**కలువాయి జులై 6 ప్రభాతవార్త :** శ్రీరుక్మిణి పాండు రంగ స్వామి వారి 25 వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను కోలహలంగా భక్తి శ్రద్దలతో నిర్వాహకులు నిర్వహించారు. మండల కేంద్ర మైన కలువాయిలో వెలసియున్న శ్రీరుక్మిణి సమేత పాండు రంగస్వామి వారి బ్రహ్మోత్స వాలలో భాగంగా ఆదివారం స్వామి వారికి గరుడసేవ వేడుకగా నిర్వహించారు.ఈ సందర్బంగా దేవస్దానం నందు విశేష పూల అలంకరణ విద్యుత్ దీపాలంకరణ భక్తులను ప్రత్యేకంగా ఆకట్టుకు న్నాయి, కార్యక్రమంలో భాగంగా స్వామి అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆలయం నందు సాంస్కృతిక కూచిపూడి భజన కార్యక్రమాలు నిర్వహించారు. గరుడవాహనంపై స్వామి అమ్మవారిని విశేషంగా అలకంరించి ఆలయ ప్రాంగణంలో రథోత్సవం నిర్వహించారు. తొలి ఏకదాశి సందర్బంగా పెద్దఎత్తున భక్తులు పాల్గోని స్వామి వారిని దర్శించుకొని కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా కృష్ణ హజరత్‌బాబు,సంధ్యారాణి,బైరశెట్టి చరణ్‌కుమార్, రూపాస్రవంతి, కొమ్మూరు రాజారావు,వనాజా శ్రావణి,పువ్వాడి కృష్ణయ్య, రాధమ్మ, గాదంశెట్టి గోపాల్ శ్యామలా,దంపతులు వ్యవహారించగా ఆలయ శ్రమదాన కార్యకర్త కృష్ణం హజరత్‌బాబు, కోశాదికారి నటకల కిషోర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# పెగళ్ళపాడులో కదం తొక్కిన తెలుగు సైన్యం

**మర్రిపాడు జులై 6 ప్రభాతవార్త :** మర్రిపాడు మండలం పెళ్ళపాడు గ్రామంలో ఆదివారం తెలుగుదేశం నాయకులు కథం తొక్కారు.రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యాక్షులు శేషం హజరత్‌బాబుయాదవ్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా గ్రామానికి విచ్చేసిన మండల టిడిపి నాయకులకు గ్రామ టిడిపి కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఘన స్వాగతం పలికారు. తెలుగుదేశం పార్టీ జెండాలు గ్రామంలో రెపరెపలాడాయి. మండల టిడిపి అద్యక్షులు దేవరాల గంగాదర్‌యాదవ్ మాట్లాడుతు కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్బంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు మండలంలో కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు.ఆత్మకూరు నియోజకర్గం అన్ని రంగాలలో సమగ్రంగా అభివృద్ధి చేసి జిల్లాలో ముందంజలో నిలేపేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. పెగళ్ళపాడు ఎస్‌సి కాలనీకి మంత్రి ఆనం నూతన రామాల నిర్మాణానికి కృషి చేయనున్నట్లు హామి ఇచ్చారని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు ఎఎంసి చైర్మన్ అరికట్ల జనార్దన్‌నాయుడు, టిడిపి మండల అద్యక్షులు గుర్రం నాగేశ్వరావు యాదవ్, మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి నారాయణరెడ్డి,భీమవరం,బూదవాడ సొసైటీ అద్యక్షులు చిన్నారెడ్డి, వన్నిపంట సుబ్బారెడ్డి,మండల తెలుగుదేశం పార్టీనాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గోన్నారు.

# ఘనంగా పీర్ల పండుగ వేడుకలు



**సీతారామపురం జులై 6 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన సీతారామపురంలో కోట వీధిలో ఉన్న పీర్ల చావిడి వద్ద జరుగుతున్న పీర్ల పండుగ వేడుకలు ఆదివారం ముగిశా యి.పీర్లపండుగ చివరి రోజు అయిన ఆదివారం సంప్రదాయం ప్రకారం సీతారామపురం మెయిన్ బజారు నందు పీర్లను వేడుకగా అటు ఇటు తిప్పుడు ప్రజలకు దర్శనం కల్పించడం జరిగింది.సీతారామపురం చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గోని పీర్లను దర్శించుకున్నారు. ముగిసిన ఈ తంతంగంతో పీర్ల పండుగ ముగిశాయి.

# కాగితాల పూరులో ఘనంగా మొహరం వేడుకలు

**మనుబలో జులై 6 ప్రభాతవార్త :** మండలంలోని కాగితాపూరులో ఆదివారం మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చెన్నై ,బెంగుళూరు,తెలంగాణ వివిధ రాష్ట్రాల నుండి వచ్చి ముస్లీం సోదరులు సుమారు 2 వందల మంది బ్లేడ్‌లతో రక్తం చిందించారు.ప్రతి ఏడాది మొహరం వేడుకలు ఇక్కడ వైభవంగా నిర్వహించడం విధితమే అదే విధంగా ఈ సంవత్సరం మొహరం వేడుకలు కమీటి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం పీర్ల చావిడి ఉరేగింపు నిర్వహించారు.చుట్టుపక్కల ప్రాంతాలైన గూడూరు,నెల్లూరు, వెంకటాచలం తదితర ప్రాంతాల నుండి పెద్దఎత్తున భక్తులు కార్యక్రమాలను వీక్షించారు.రాత్రి భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.పీర్ల చావిడిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.గ్రామంలో మొహరం పండుగ శోభాయ మానంగా జరిగింది.

# నిరంతరాయంగా విద్యుత్ సేవలు

– దర్గా నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర



**నెల్లూరు, జులై 6 ,ప్రభాతవార్త-వైద్యం :** రొట్టెల పండుగ సందర్భంగా బారా షాహిద్ దర్గాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ స్టాల్ నందు నిరంతర విద్యుత్ సరఫరాను పర్యవేక్షిస్తున్న అధికారులు. ఆదివారం ఎంఆర్‌టీ విభాగరపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ టీం దర్గాలో ఉన్న ప్రతి ఒక్క షాపును పరిశీలించి వైరింగ్ ఎలా ఇచ్చారో జాయింటన ఏమైనా ఉన్నాయా అతుకులు ఏమైనా ఉన్నాయో అని పరిశీలించి పలు సూచనలు ఇవ్వడం జరిగింది. మూడు షిఫ్టులలో సిబ్బంది పని చేస్తూ ఉన్నారని, ప్రత్యేక స్టాల్ నుండి నోడల్ ఆఫీసర్ బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ నెల్లూరు శ్రీధర్ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఉన్నారని ఓవరాల్‌గా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ పనులన్నింటిని చూస్తూ ఉన్నారని అధికారులు తెలిపారు.

# మంత్రిని కలిసిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు



**నెల్లూరు, జులై 6 ,ప్రభాతవార్త-వైద్యం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖలో పని చేస్తు హెల్త్ ఎడ్యుకేటర్స్ రాష్ట్ర అసోసియేషన్ ద్వారా విన్నవించిన విన్నంపై సానుకూలంగా స్పందించి హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టు హోదా పేరును డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా మార్పు చేస్తూ రాష్ట్ర ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీకృష్ణబాబు జూన్ 6న జీవో ఎంఎస్ నంబరు 64 ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. మా రాష్ట్ర అసోసియేసన్ ద్వారా సమర్పించిన విన్నపాలపై సానుకూలంగా స్పందించి, మా హోదా పేరు మార్పు గురించి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన రాష్ట్ర మున్సిపల్ శాఖ, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్, డైరక్టర్ గొల్లపూడి వారికి, మా ఫైల్ విషయంలో సహాయం చేసిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు, ధనలక్ష్మీపురం ప్రైవేటు హోటల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి డిప్యూటీ మెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేసన్ మీటింగ్ ఏర్పాటు సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి విచ్చేసిన డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ నారాయణ సార్‌ని ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెల్ఫేర్ అసోసియేసన్ రాష్ట్ర అద్యక్షులు డబ్ల్యూ వెంకటరమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజర్ల సుధాకరరావు, రాష్ట్ర కోశాదికారి ఎన్.హరిప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల నుండి వచ్చిన డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అనురాధ, సరోజిని, శివరామకృష్ణ, కృష్ణ మోహన్, రమణ, పాల్గొన్నారు.

# అల్లూరులో గడ్డివామి దగ్గం



**అల్లూరు,జులై 06 ప్రభాతవార్త:** అల్లూరు తూర్పు వీధి మారుతి కాలనీలో శనివారం రాత్రి గడ్డివామి కాలిపోయిన సంఘటన చోటు చేసుకుంది. అదే కాలనీలో పిల్లి నాంచారమ్మ కు చెందిన 15 ఎకరాల గడ్డివామి ఆమె కళ్ళ ముందే కాలి బూడిదవడంతో ఆ మహిళా రైతు లబోదిబోమన్నారు. పశువులు మేపుకొని జీవనం సాగించే ఆమెను ఇరుగుపొరుగువారు ఓదార్చరు. ఫైర్ ఇంజన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఆ మహిళా రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# నారా లోకేష్‌కి స్వాగతం పలికిన రాజగోపాల్ రెడ్డి



**నెల్లూరు, జులై 6, ప్రభాతవార్త-వైద్యం :** తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి వర్యులు నారా లోకేష్ బాబు కి రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలికిన సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.

# ఇన్‌ఛార్జీ డీఆర్వోగా హుస్సేన్ సాహెబ్

**నెల్లూరు కలెక్టరేట్, జులై 6, ప్రభాతవార్త :** జిల్లా ఇన్‌ఛార్జీ డిఆర్ఓగా తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ హుస్సేన్ సాహెబ్ నియమితులయ్యారు. డిఆర్ఓగా పనిచేస్తున్న ఉదయ భాస్కరరావు తాజాగా ఇక్కడి నుండి బదిలీ అయిన విషయం విదితమే. రెవెన్యూ శాఖ అసిస్టెంట్ సెక్రటరీగా సెక్రటేరియట్‌కు ఎన్ని బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. రెగ్యులర్ డిఆర్ఓను నియమించే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించిన నేపథ్యంలో ఆ బాధ్యతను తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌కు అప్పజెప్పారు.

# కిడ్నాప్‌కు గురై చికిత్స పొందుతున్న యువకుడ్ని పరామర్శించిన జనసేన నేత టోనీ



**నెల్లూరు, జులై 6 ,ప్రభాతవార్త-వైద్యం :** జనసేన నేత శ్రీపతి రాము కుమారుడు ఇటీవల కిడ్నాప్‌కు గురైన విషయం సంచలనంగా మారింది. కొంత మంది ఆ యువకుడ్ని కిడ్నాప్ చేసి అతనిపై దాడి చేసినట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న జనసేన సీనియర్ నాయకుడు టోనీ బాబు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ యువకుడ్ని పరామర్శించారు. ఈ సందర్భంగా టోనీ బాబు మాట్లాడుతూ జనసేన నేత శ్రీపతి రాము కుమారుని వైసీపీ గుండాలు కిడ్నాప్ చేసి అతనిపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఆ యువకుడ్ని జీజీహెచ్‌లో పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారన్నారు. ఇటువంటి దుర్మార్గపు ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## ప్రజా ప్రభుత్వం కూటమి ప్రభుత్వం



**కోవూరు, జూలై 6 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం జొన్నవాడ దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలంలోనే ఊహించని విధంగా ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రధానంగా విద్యాశాఖలో పూర్తిస్థాయిలో మార్పుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గతం ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం మెరుగైన పరిపాలన ప్రజలకు అందు తుందన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా సామాజిక సేవలో తరిస్తున్నారన్నారు. అటువంటి ఎమ్మెల్యే మళ్లీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరాజు, మాజీ కోఆర్షన్ సభ్యుడు జహంగీర్, మాజీ సర్పంచ్ ప్రసాద్, సురేష్, నాగరాజు, తదితరులు ఉన్నారు.

## వైభవంగా పుష్పయాగం బుట్టల ఊరేగింపు



**కోవూరు జూలై 6 ప్రభాతవార్త :** స్థానిక గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో ఆదివారం ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయంలో పుష్పయాగం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రుత్వికులు పుష్పాల బుట్టలకు ప్రత్యేకంగా మంత్రజలంతో అభిషేకించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఈ పూల బుట్టలను ఉభయకర్తలు, భక్తులు తీసుకుని దేవాలయం చుట్టూ ఊరేగారు. ఈ కార్యక్రమంలో , రుత్వికులు పరాంకుశం రాఘవాచార్యులు, నాగరాజు స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంద్ర స్వామి,, భక్తులు ఉన్నారు.

## వైభవంగా పీర్ల ఊరేగింపు



**కోవూరు జూలై 6 ప్రభాతవార్త :** కోవూరులోని బజారు సెంటర్‌లో మొహర్రం పర్వదినం సందర్భంగా పీర్ల చావిడిలో ఆదివారం తెల్లవారుజామున ముస్లిం యువకులు పెద్దఎత్తున నిప్పుల గుండంలో నడిచి తమ భక్తిని చాటుకున్నారు. ఆదివారం సాయంత్రం పీర్లను బండ్లపై మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య కోవూరు పురవీధుల్లో ఊరేగించారు. ముస్లిం యువకులు, మత పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కన్యకా పరమేశ్వరికి ఆషాడ మాస సారె



**కోవూరు, జూలై 6 ప్రభాతవార్త :** కోవూరులోని రైల్వే రోడ్డులో వెలసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆషాడ మాస ఏకాదశి పర్వదినం సందర్భంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున సారెను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా మేళతాళాలు మంగళవాయిద్యాల మధ్య సారెను తెచ్చి అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రధాన అర్చకులు నందకిషోర్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి రమేష్‌బాబు, భక్తులు ఉన్నారు.

## పేద ఆర్యవైశ్య మహిళకు ఆర్థిక సహాయం చేసిన అమరా



**కావలిరూరల్, జులై 6 ప్రభాతవార్త :** కావలి కాటం రెడ్డి వారివీధిలో కావమ్మ కాంప్లెక్స్ నందు పెంకు టింటిలో బాడుగకు ఉంటున్న పొన్నూరు మహాలక్ష్మమ్మకు ఆరోగ్యంబాగలేక మెరుగైన వైద్యం కొరకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసు కున్న 33వ వార్డు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అమ రా వేదగిరి సుబ్బరాయుడుగుప్తా, కావలి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కళ్యాణ మం డపం నందు 30వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మహాలక్ష్మమ్మకు ఆదివారం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తటవర్తి రమేష్ పాల్గొని మహాలక్ష్మమ్మకు తన వం తుగా 10వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఆమె ఆరోగ్య ఖర్చులకై మొత్తం కలిపి 40వేల రూపాయలను సమకూర్చడం జరిగింది. మహాలక్ష్మమ్మకు సహాయం అందచేసిన వారు ఆర్యవైశ్య నేతలు బలస ప్రసాద్, చలువాది రవికిరణ్, గాదంశెట్టి మధుసూధన్‌రావు, మామిడి రామకృష్ణ, చీదెళ్ల కిషోర్‌గుప్తా, నల్లూరు వెంకటరమేష్, పొన్నూరు శ్రీనివాసులు, పబ్బతి సత్యనారాయణ, ఒరుగంటి సురేష్, ఒరుగంటి రామకృష్ణ, ఒరుగంటి రవి, చవల సాయికృష్ణ, సాయి, పెండ్యాల వేమారావులు ఆర్థిక సహా యాన్ని చేయడం జరిగింది.

## బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న పురస్కారాన్ని అందచేయాలి



**కావలిరూరల్, జులై 6 ప్రభాతవార్త :** దళితజాతి కోసం భారతావనిలోని ప్రతి ఒక్కరికోసం అనేక పదవులను అలంకరించి జాతిని ముందుకు నడిపించిన భారతమాజీ ఉపప్రధాని, దళిత జనోద్ధారకుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మార్పీయస్ సీనియర్ నాయకులు చేవూరుకిరణ్‌కుమార్ తెలియచేశారు. పద్మశ్రీ మందా కృష్ణమాదిగ ఆదేశాల మేరకు చేవూరు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా కావలి పట్టణంలోని మాగుంట పార్వతమ్మ ట్రంకు రోడ్డులో ఏర్పాటుచేసిన డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆదివారం ఎమ్మార్పీయస్ నేతలు పూలమాలలువేసి ఘనంగా నివాళుల ర్పించారు. చేవూరి కిరణ్‌కుమార్ మాట్లాడారు. డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ అతిచిన్నవయసులోనే పార్లమెంట్‌లో అడుగుపెట్టి ఎన్నో పదవులను అధిరో హించిన రాజకీయ దురంధరుడు, ప్రజాసేవకుడని తెలియచేశారు. అనంతరం జోహార్ బాబుజగ్జీవన్‌రామ్ అంటూ, వర్ధిల్లాలి పద్మశ్రీ మంద కృష్ణమాదిగ నాయకత్వం అంటూ నినాదాలు చేశారు. ఎమ్మార్పీయస్ నాయకురాలు విజయమ్మ, సాల్మన్, అక్కిలిగుంట శామ్యూల్, మందా రమేష్, ముస్లిం మైనారిటి మహిళ బీబీజాన్, దావులూరి శేఖర్, దావులూరు మదన్, ఎమ్మార్పీయస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌లకు ఉచిత వైద్యశిబిరంను ఏర్పాటుచేసిన ఐఎంఎ



**కావలిరూరల్, జులై 6 ప్రభాతవార్త :** డాక్టర్స్‌డేను పురస్కరించుకుని కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) ఆధ్వర్యంలో ఆదివారం కావలి ఇండియన్ రెడ్‌క్రా స్ భవనం నందు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ వ్యాధులపై ఉచిత వైద్యశిబిరంను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్యశిబిరాన్ని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లా డారు. మహిళలను క్యాన్సర్ బారినుండి రక్షించే దిశగా ఇంత భారీస్థాయిలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని కావలిశాఖ ఐఎంఎను అభినందించారు. కావలి ఐఎంఎ డాక్టర్లకు సహజఆరోగ్యం, సేవలపట్ల ఎంతో అంకితభావాన్ని తెలియచేస్తున్నాయని కొనియాడారు. ఈ వైద్యశిబిరం నందు కావలి మరియు పరిసరప్రాంత మహిళలు 250 మంది పాల్గొని మాయోగ్రఫి, సిబిఇ పాప్‌స్మియర్, బయాప్సి వంటి 5 వేల రూపాయల విలువైన వైద్యపరీక్షలు ఉచితంగా చేయడం జరిగింది. ఈ వైద్యశిబిరంలో నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ లక్ష్మి వ్యాధులపై అవగాహన కల్పించడం జరిగింది. స్త్రీలలో క్యాన్సర్ రావడానికి గల కారణాలు తొలిదశలో వాటిని ఏ విధంగా గుర్తించాలి, సకాలంలో పరీక్షలు చేయించడం వలన కలిగే లాభాలు వంటి పలు విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ లక్ష్మిని మెమెంటో అందచేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎంఎ కావలిశాఖ అద్యక్షులు డాక్టర్ కె.సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ గోపి, కోశాధికారి డాక్టర్ పి.శివప్రసాద్, క్యాంపు కన్వీనర్ డాక్టర్ ఎ.నళినిపద్మ, ఐఎంఎ ఉమెన్‌రింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉష, పింక్‌మిషన్ కావలి ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ ఉషారాణి, ఉదయగిరి రేడియాలజిస్ట్ డాక్టర్ వెన్నెల, హైదరాబాద్ రేడియాలజిస్ట్ డాక్టర్ అయిషిత, కావలి పట్టణంలోని పలువురు గైనకాలజిస్ట్‌లు, రేడియాలజిస్ట్‌లు, కావలి ఐఎంఎ డాక్టర్లు పాల్గొన్నారు. నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది ఉచిత వైద్యశిబిరానికి వైద్యసేవలు అందించారు.

## ఏకలవ్య మహారాజు ఆశయాలను అందరం కొనసాగిద్దాం



**కావలిరూరల్, జులై 6 ప్రభాతవార్త :** ప్రతి ఎరుకల కులస్తులందరూ ఒకే త్రాటిపై నిలిచి ఏకలవ్య మహారాజును స్మరించుకుని ఆయన ఆశయాలను కొనసాగిద్దామని ఆంధ్రప్రదేశ్ ఎరుకుల గిరిజన సక్షేమ సంఘం రాష్ట్రఅద్యక్షులు మొగిలి కల్లయ్య తెలియ చేశారు. కావలి బాలకృష్ణారెడ్డినగర్ గిరిజనకాలనీలో ఆదివారం ఏకలవ్య మహారాజు జయంతిని ఎరుకుల కుటుంసభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మొగిలి కల్లయ్య మాట్లాడారు. ఉదయాన్నే ఏకలవ్య మహారాజును తలచుకుని ఏ పనిని మొదలుపెట్టినా విజయం సాధిస్తా మని తెలియచేశారు. ఏకలవ్య మహారాజు ఆశయాలను కొనసాగిస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ పట్టణ అద్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, తెలుగురైతు జిల్లా ఉపాద్యక్షులు బొట్లగుంట శ్రీహరినాయుడు, నెల్లూరు జిల్లా గిరిజన సంక్షేమసంఘం అద్యక్షులు బోగిరి ప్రభాకర్, కావలి నియోజకవర్గ ఎస్‌సి సెల్ ఉపాద్యక్షురాలు కొల్లూరు అశ్విని, బోగిరి రమణమ్మ, గిరిజన డైరక్టర్ ఆవుల అరుణమ్మ, 16వ వార్డు అద్యక్షులు ఇగుటూరి మాల్యాద్రి, బాబ్జి, మొగిలి విజయ్‌కుమార్, నాయబ్‌రసూల్, కామంచి శ్రీనివాసులు, మొగిలి సురేష్, మొగిలిబాబు, గిరిజన, ఎరుకుల కులపెద్దలు పాల్గొన్నారు.

## రంగా విగ్రహ ఆవిష్కరణకు విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు



**కావలిరూరల్, జులై 6 ప్రభాతవార్త :** ఇటీవల కావలి మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులో ఏర్పాటుచేసిన ప్రజానాయకులు స్వర్గీయ వంగవీటి మోహన్‌రంగా కాంస్యవిగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి రంగా విగ్రహ కమిటి సభ్యులు ధన్యవాదాలు తెలియచేశారు. ఈ సందర్భంగా కావలి పట్టణంలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రంగా విగ్రహకమిటి కన్వీనర్ దేవరకొండ శ్రీనివాసులు, కమిటి సభ్యులు పాల్గొని మాట్లాడారు. రంగా కాంస్య విగ్రహ ఆవిష్కరణకు విచ్చేసిన పురపాలకశాఖామంత్రి పొంగూరు నారాయణకు, భారీనీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు, రంగా తనయుడు విజయవాడ మాజీ శాసనసభ్యుడు వంగవీటి రాధాకృష్ణకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియచేశారు. రంగా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా, దిగ్విజయంగా జరగడానికి కారకులైన కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రంగా అభిమానులకు, కులమతాలకు, పార్టీలకు అతీతంగా విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా స్వర్గీయ వంగవీటి మోహన్‌రంగా విగ్రహ కమిటి సభ్యులు కృతజ్ఞతలు తెలియచేశారు.

## బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించిన వైసిపి నేతలు



**కావలిరూరల్, జులై 6 ప్రభాతవార్త :** కావలి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి, కావలి మాజీ శాసనస భ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాలమేరకు ఆదివారం కావలి పట్టణంలోని రామిరెడ్డి ప్రతాప్‌కు మార్‌రెడ్డి నివాసంవద్ద భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు ఆయనను స్మరించుకుని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైయస్ ఆర్‌సిపి జిల్లా ఎస్‌సిసెల్ అద్యక్షులు పందిటి కామరాజు, జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, వైసిపి నేతలు కుందుర్తి కామయ్య, నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, దేగా రామయ్య యాదవ్, ఆత్మకూరి రాజేష్, పరుసు మాల్యాద్రి, ఇర్ల సురేష్, నాగేశ్వరమ్మ, వైసిపినేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిప్పల యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి



**బిట్రగుంట జులై 6 ప్రభాతవార్త:** బోగోలు మండలం కప్పరాల తిప్పకు చెందిన ఇరగాల దీన్నె నాని(21) ఆదివారం అనుమానాస్పద స్థితిలో అల్లూరు చెరువులో మృతి చెందినట్లు బిట్రగుంట పోలీసులు తెలిపారు. ఇరగాల దిన్నె నాని శనివారం మధ్యాహ్నం నుండి కనిపించకపోవడంతో బిట్రగుంట పోలీస్ స్టేషన్లో నాని తల్లి శరణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడిని అల్లి మడుగు సంఘానికి చెందిన వ్యక్తులు తీసుకొని వెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డట్టు ఆమె ఆ ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు నాని కోసం గాలింపు చర్యలు చేపట్టగా అల్లూరు చెరువులో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసును కావలి రూరల్ సీఐ పాపారావు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెల్లడి అయ్యే అవకాశం ఉంది.

## బోగోలులో సుపరిపాలనలో తొలి అడుగు

**బిట్రగుంట జులై 6 ప్రభాతవార్త :** కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదే శాల మేరకు మండలం టిడిపి నాయకులు బోగో లు మేజర్ పంచాయతీ లోని బేతనియపేట 194 వ బూత్ లో కూటమి



ప్రభుత్వం ఏర్పడి సంవ త్సర కాలం ఆయన సందర్భంగా ప్రజలకు అంది న పథకాలు సమస్యలు తెలుసుకునేందుకు తల పెట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్ర మం ఆదివారం నిర్వహించారు.. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పనితీరు, వారి యొక్క సమస్యలు అడిగి అధిష్టానానికి తెలియపరిచేలా యాప్ లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో బోగోలు మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు,కోడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, యూనిట్ ఇంచార్జి గోచిపాతల సంజయ్, బూత్ కన్వీనర్ మర్లపాటి బాబు, కో కన్వీనర్ ఎండ్లూరి అనిల్, నాయకులు గోసాల శ్యాంసుందర్, ఎండ్లూరి ఫీలోమాన్ రాజ్, అద్దంకి జయనందం, గుంటగాని రాజకుమార్, వినోద్, వంశీ,చంటి,బాబీ,చిట్టి,నితిన్, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రొట్టెల పండుగలో రెడ్‌క్రాస్ సేవలను సద్వినియోగం చేసుకోండి

– చైర్మన్ వాకాటి విజయ్ కుమార్‌రెడ్డి



**డాక్యుమెంట్ పోయినది**

తేది 24.06.1993న దస్తావేజు నెంబరు 1191/1993గా కొనుగోలు చేసిన ఆస్తికి ఒరిజినల్ డాక్యుమెంటు తేది. 27.6.2025 న కావలి విష్ణులయం వీధి నుండి కావలి బృందావనం హౌసింగ్ కాలనీకి బైక్‌పై వెళు చుండగా పోయినది. ఎవరికైనా దొరికిన యెడల తెలియజేయగలరు.

**మొగుళ్ళపల్లి రాజశేఖరం**

సెల్: 9849249117

**నెల్లూరు, జులై 6, ప్రభాతవార్త–వైద్యం :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శాఖ చైర్మన్, వాకాటి విజయ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండుగలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అందించే విస్తృత సేవలను సద్వినియోగం చేసుకోవాలని, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్ కోరారు. దర్గాలోని రొట్టెల పండుగ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ రొట్టెల పండుగ జరిగే ఐదు రోజులు సేవలందిస్తుందని తెలిపారు. 6వ తేదీ ఉండి 10వ తేదీ వరకు రొట్టెల పండుగ ప్రాంగణంలో రెడ్ క్రాస్ ప్రథమ చికిత్సా శిబిరం జరుగుతుందన్నారు. అంబులెన్స్ సర్వీసులు అందుబాటులో ఉంటాయ న్నారు. ఇందులో భాగంగా యూత్ రెడ్ క్రాస్, విపత్తుల నివారణ కార్యక్రమాలను, 100 మంది రెడ్ క్రాస్ స్వచ్ఛంద సేవకుల సహకారాలతో ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరం నందు ఐఆర్సీఎస్ సిబ్బంది, పీఎంపీ, ఆర్ఎంపీ సభ్యులు, డీకే డబ్ల్యూ కాలేజీ, కృష్ణ చైతన్య కాలేజీ స్టూడెంట్స్ సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఏవీ సుబ్రహ్మణ్యం, ఐఆర్సీఎస్ ఎంసీ మెంబర్ దాసరి రాజేంద్ర ప్రసాద్, ఏవో సీహెచ్ చంద్రశేఖర్, జీజీ హెచ్ దంత వైద్యులు డాక్టర్ ఎంబెటి శ్రీకాంత్, జిల్లా పీఎంపీ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, ఆర్ఎంపీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్ భాషా, యూత్ రెడ్ క్రాస్ మెంబర్ కన్యాకుమారి, స్వాతి, వైష్ణవి, విష్ణు, జాకబ్ శ్రీను, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమం



**కందుకూరు, జులై 6 ,ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కందుకూరు నియోజకవర్గ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కందుకూరు మండలం గ్రామాల్లో, పట్టణ వార్డులలో తొలి అడుగు కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ యూనిట్, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు. డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించి రాష్ట్రంలో, కందుకూరు నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలను, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, సీనియర్ నాయకులు గుళ్ళ శ్రీనివాసరావు, క్లస్టర్ యూనిట్, గ్రామ, వార్డు అధ్యక్షులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏఎస్సైగా పదోన్నతి పొందిన జగదీష్



**తోటపల్లిగూడూరు, జులై 6 ,ప్రభాతవార్త :** 1990లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం ప్రారంభించిన పినగ జగదీష్ శనివారం ఏఎస్సైగా పదోన్నతి పొందారు. ఆయన 1990 సంవత్సరంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం ప్రారంబించి 2010 సంవత్సరంలో సివిల్‌కు కన్వెన్షన్ అయి నెల్లూరు, కావలి, కోవూరులో పని చేసి 2017సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది తోటపల్లిగూడూరు మండలంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఉండగా 2025 సంవత్సరం జులై 6వ తేదీ ఏఎస్సైగా ఆయనకు పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆయనను కలిసి ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సహకారంతో తనకు ఈ ప్రమోషన్ లభించిందని, ఏఎస్సైగా బాధ్యతలు చేపట్టి ఆదివారం రొట్టెల పండుగ సందర్భంగా కోడూరు బీచ్‌కు అధికంగా భక్తులు సముద్ర స్నానాలకు వస్తుండడంతో తోటపల్లిగూడూరు ఎస్సై ఆదేశానుసారం ఉద్యోగ బాధ్యతలు నిర్వహించేందుకు ఇక్కడికి వచ్చి అదే సందర్భంలో బీచ్ సమీపంలో ఉన్న మేరీ మాత అనుగ్రహం పొంది ఆమె ఆశీర్వాదం తీసుకునేందుకు మేరీ మాత చర్చికి రావడం జరిగిందని ఆయన తెలిపారు.

## కష్టానికి దక్కిన ఫలితం కృష్ణపట్నం సిద్దేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా మామిడాల శ్రీనివాసులు



**ముత్తుకూరు, జూలై 6, ప్రభాతవార్త :** కష్టానికి తగిన ఫలితం దక్కిందని కృష్ణపట్నం శ్రీ కామాక్షితాయి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయం, వేణుగోపాల స్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్‌గా మామిడాల శ్రీనివాసులు నియమి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ టిడిపి పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పక ఫలితం దక్కుతుందని అన్నారు. చరిత్ర కలిగిన దేవస్థానాలకు తనను చైర్మన్‌గా ప్రకటించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే స్థానిక టిడిపి నాయకులు రాగాల శివకృష్ణ, టిడిపి నాయకులు, గ్రామస్తులు మామిడాల శ్రీనివాసులను చైర్మన్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేసారు.

## ఘనంగా జరిగిన ఏపీ జిఈఏ నాయకుల సన్మానం




**నెల్లూరు కలెక్టరేట్, జులై 6, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలోని ఏనుగు సుందరరామిరెడ్డి కల్యాణ మండపం నందు ఏపీ జిఈఏ ఉద్యోగ సంఘ నాయకులు చొప్పా రవీంద్రబాబు, ఏనుగు రమణారెడ్డి, యడవల్లి మల్లికార్జున, గునుపాటి శ్రీనివాసులు రెడ్డి, ఎ. గిరిజల ఉద్యోగ విరమణ సత్కార కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ నేటి సన్మాన గ్రహీతల ఉద్యోగ సేవలు, ఏపీజిఈఏ సంఘ నిర్మాణాత్మక సేవలు అత్యంత ప్రశంసనీయం స్ఫూర్తిదాయకమని, వారిని తాను ఎంతో అభిమానిస్తానని అంటూ, యువత ఇలాంటి నాయకులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్. రమేష్ కుమార్ మాట్లాడుతూ రవీంద్రబాబు, రమణారెడ్డి తదితరులు సంఘానికి ఎంతో మంది యువ నాయకులను అందించారని ప్రశంసించారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి నాగసాయి మాట్లాడుతూ నేడు సన్మాన గ్రహీతల ఉద్యోగ సంఘ సేవలు ఆదర్శనీయమని ప్రశంసించారు. పలువురు వక్తలు సన్మాన గ్రహీతలు చేసిన సేవలను ప్రస్తుతిస్తూ ప్రశంసలు కురిపించారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన ఏపీ జి ఈఏ నాయకులకు ముఖ్య అతిథుల చేతులమీదుగా అత్యంత ఘన సత్కారం జరిగింది. చివరగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ, ఇంత మంది ఉద్యోగుల, ఉద్యోగ నాయకుల అభిమానాన్ని చూరగొనడం తన అదృష్టమని, ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగ, సామాజిక సేవలలో భాగస్వామ్యులవుతామని అంటూ, హాజరైన అశేష ఉద్యోగ వాహినికి ధన్యవాదాలు తెలిపారు. తదుపరి కె ఆర్ సూర్యనారాయణ సమక్షంలో ఏనుగు రమణారెడ్డి అధ్యక్షతన వై మల్లికార్జున కార్యదర్శిగా నెల్లూరు జిల్లా ఏపీ జిఈఏకు అనుబంధంగా పెన్షనర్ల విభాగం ఏర్పాటైంది. నూతన పెన్షనర్ల సంఘానికి జిల్లా కార్యవర్గం అభినందనలు తెలియజేసారు.

## ప్రత్యేక పూజలు నిర్వహించిన కావలి ఎమ్మెల్యే



**కావలిరూరల్, జులై 6 ప్రభాతవార్త** తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా కావలి పట్టణంలో పలు ఆలయాల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజాకార్యక్రమాల్లో ఆదివారం కావలి ఎమ్మెల్యేపాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. పట్ట ణంలోని రైల్వేరోడ్డులోని గీతా మందిరంలో పూజా కార్యక్రమంలో, శివాలయం వీధిలోని గాలిగంగమ్మ ఆలయంలో జరిగిన అభిషేక కార్యక్రమంలో అమ్మవారిని దర్శించుకుని కావలి నియోజకవర్గ ప్రజలు సుఖసం తోషాలతో ఉండాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



**నెల్లూరు అగ్రికల్చర్, జులై 6 ,ప్రభాతవార్త** నెల్లూరు రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఉన్న వెటర్నరీ పోలీ క్లినిక్‌లో జూనోసిస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు రాబిస్ నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరక్టర్ కే.రమేష్ నాయక్ ప్రారంభించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా తొలుత ప్రపంచ ప్రసిద్ధిగాంచిన జీవశాస్త్రవేత్త, లూయిపాశ్చర్ చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ నాయక్ మాట్లాడుతూ ర్యాబిస్ వ్యాధిని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ముమ్మర చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలోని అన్ని పశు వైద్యశాలలకు 50 వేలు డోసులు రేబిస్ నివారణ టీకాలు పంపడం జరిగిందని తెలిపారు. పెంపుడు జంతవులు వలన సంక్రమించే వ్యాధుల పట్ల జంతు ప్రేమికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భాగా మరిగించిన పాలను తాగడం, బాగా ఉడికించిన మాంసం తినడం వలన ఆయా జంతువులకు ఉన్న దీర్ఘకాలిక వ్యాధులు మనుషులకు సంక్రమించకుండా కాపాడుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన డీఎంఅండ్‌హెచ్‌ఓ వి.సుజాత మాట్లాడుతూ జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. దోమల వలన వ్యాధులు వ్యాపించకుండా కాపాడుకోవాలని సూచించారు. అనంతరం వెటర్నరీ పోలి క్లినిక్ వైద్యులు ఉపసంచాలకులు, డాక్టర్ టి.సోమయ్య మాట్లాడుతూ నెల్లూరులోని వెటర్నరీ పోలీ క్లినిక్‌లో ప్రతి రోజు ఉదయం యాంటి రాబిస్ ఇంజక్షన్ వేయడం జరుగుతుందని, కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెంపుడు జంతువులు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండే విధంగా యజమానులు చూసుకోవాలన్నారు. జూనోసిస్ దినోత్సవం సందర్భంగా 242 రాబిస్ టీకాలను వేయడం జరిగిందన్నారు. తదుపరి అడిషనల్ డీఎం అండ్ హెచ్, ఎస్‌కే ఖాదర్ వలి చేతుల మీదుగా టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మాలకొండయ్య, వైద్యులు డాక్టర్ జే.చైతన్య కిషోర్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ సీమెచ్ రామచంద్రరావు నారాయణ, వైద్య కళాశాల ప్రొఫె సర్ కనన్, ఫౌండేషన్ ఆఫ్ ఎనిమల్స్ కార్యదర్శి ఉమాదేవి, ఏపీయుడబ్ల్యూజే, రాష్ట్ర కార్యదర్శి, జయ ప్రకాష్, పెంపుడు జంతువుల యజమానులు, రైతులు, విద్యార్థులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మరాజు స్వామిని దర్శించుకున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, జులై 6, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలోని ధర్మరాజు స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ నిర్వాహకులు మంగళ వాయిద్యాలుతో పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి స్వాగతం పలికారు. అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు సాదా గోపి ఉభయ కార్యక్ర మంలో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్ర మాల్లో పర్వత రెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయ సప్పరోత్సవంలో పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గారు పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ముందుగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు.. నెల్లూరు జిల్లా ప్రజలకు తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. ధర్మరాజు స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరు కావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు సాదా గోపి ఉభయ కార్యక్ర మంలో భాగంగా స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమని తెలిపారు. ఆ దేవదేవుని ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వేలూరు ఉమా మహేష్, ధర్మరాజు ఆలయ మాజీ చైర్మన్ సి.రామకృష్ణా, అగ్ని కుల క్షత్రియ సంఘం నాయకులు మద్దూరు సుబ్బారావు, శివపురం సురేష్, ఇలపాక శివకుమార్ ఆచారి, శంకర్, నాగరాజు, ధనుంజయ, పిచ్చయ్య ఆచారి, జెమిని శ్రీనివాసులు, కుమార్, సుధీర్, శివగామి, కిషోర్, అగ్నికుల క్షత్రియ బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ రాష్ట్ర కార్యవర్గంలో జాయింట్ సెక్రటరీలుగా
### నియమితులైనవారికి సన్మాన కార్యక్రమం



**నెల్లూరు రూరల్, జులై 6, ప్రభాతవార్త** నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యవర్గంలో జాయింట్ సెక్రటరీలుగా నియమితులైన రూరల్‌కు సంబంధించిన హంసకుమార్‌ని, అలాగే నెల్లూరు సిటీకి చెందిన బాలకృష్ణారెడ్డిని వైఎస్ ఆర్సిపి నేతలు అందరూ సన్మానించారు. పార్టీకి అంకితభావంతో పనిచేస్తామని, పార్టీ పురోగభివృ ద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు. తమకు ఈ అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి, ఆనం విజయకుమార్ రెడ్డికి, కాకాణి గోవర్ధన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియసుకున్నారు.

## మండలంలో విద్యా వ్యవస్థలో పలు సమస్యలు
### - విద్యాశాఖ మంత్రి గారూ కోవూరుపై దృష్టి సారించరూ







**కోవూరు, జులై 6 ప్రభాతవార్త :** గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద కోట్లాది రూపాయలు వ్యయం చేసి కోవూరు మండలంలో పాఠశాల అభివృద్ధి చేసింది. అయితే ఈ పాఠశాలలో ఏర్పాటు చేసిన 12 వాటర్ ప్లాంట్లలో 8 ప్లాంట్లు నేటికీ మరమ్మతుల్లో ఉన్నాయి. దీంతో పాఠశాల విద్యార్థులు మంచినీటి కోసం తీవ్ర అవస్థ పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రధానోపాధ్యాయులు డబ్బులు ఖర్చు పెట్టి రిపేరు చేయి స్తున్నా అవి తరచుగా మరమ్మతులకు గురవుతూనే ఉన్నాయి. ఇందుకు కారణం ఏర్పాటు చేసిన ఆ వాటర్ ప్లాంట్లు ఆశించిన మేర నాణ్యతా ప్రమాణాలు లేకపోవడమే.. ముఖ్యంగా చెర్లోపాలెం గ్రామంలో నాడు-నేడు పథకం కింద లక్షలాది రూపాయలు వ్యయం చేసి ఆ భవనాలకు ఒక రూపు తీసుకొచ్చినా అందులో విద్యార్థులు లేక గత సంవత్సరం కాలంగా ఆ పాఠశాల మూసివేత దిశలో ఉంది.

**- విద్యార్థుల కోసం ఎదురుచూపు** ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో సమూల మైన మార్పులు చేసిన పరిస్థితుల్లో పలు పాఠశాలల్లో విద్యార్థులు లేక వారికోసం ఉపాధ్యాయులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరికొన్ని పాఠశాలల్లో మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఏర్పాటు చేయడంతో అందులో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉన్నా గదులు లేక చెట్ల కింద పాఠాలు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి వాటిపై ప్రస్తుతం జిల్లాకు వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. కొన్ని పాఠశాలల్లో గదులు ఉన్నా.. ఉపాధ్యాయులు ఉన్నా కేవలం ఇద్దరు విద్యార్థులు ఉన్న పరిస్థితి కూడా మండలంలో ఉంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి మండలంలోని విద్యాశాఖలో ఉన్న పలు లోటుపాట్లను సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

## సాయినాధునికి నాగపడిగ బహూకరణ



**కోవూరు, జులై 6 ప్రభాతవార్త :** జాతీయ రహ దారిలో వెలసి ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా సుప్రజ , మణికంఠ శ్రీనివాసులురెడ్డి దంపతులు ఆదివారం లక్ష రూపాయలు విలువ చేసే నాగపడిగను, కిరీటాన్ని ఆలయ శాశ్వత ధర్మకర్త పచ్చిపాల రా ధాకృష్ణారెడ్డికి అం దజేశారు. ఈ సంద ర్భంగా దాతలను ధర్మకర్త ప్రత్యేకంగా అభినం దించారు. ఈ సంద ర్భంగా ఆలయంలో భారీ స్థాయిలో భక్తులు పా ల్గొన్నారు. అనంతరం పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి, శేఖర్‌స్వామి, పద్మనాభ స్వామి, తదితరులు ఉన్నారు.

## వైభవంగా పూర్ణాహుతి



**కోవూరు జులై 6 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కో దండరా మస్వామి దేవస్థానంలో ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వా మివారికి ప్రాత:కాలమునే ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వ ర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయ బద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ కర్తలుగా జి. భర త్‌రెడ్డి, శార్వాణి దంపతులు, పచ్చిపాల ఫణికుమా ర్‌రెడ్డి,స్వర్ణలత దంపతులు,పూనూరు వెంకటరమణారెడ్డి నిర్మలమ్మదం పతులు వ్యవహరించారు .రుత్వికులు పరాంకుశం రాఘవాచార్యులు,నాగరాజు స్వా మి,నందకి షోర్‌స్వామి, ఫణీంద్రస్వామి, ఉన్నారు.

## వైభవంగా పుష్పయాగం.. పోటెత్తిన భక్తులు





**కోవూరు జులై 6ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీకోదండ రామ స్వామి దేవస్థానంలో ఆదివారం ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయంలో పుష్పయాగ కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్తల సహకారంతో వంద కేజీల పైగా వివిధ రకాల పుష్పాలను తీసుకుని వచ్చి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ఈ పుష్పయాగ పూజా కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.పుష్పయాగ పూజ అనంతరంభక్తులందరికీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా జి. భరత్‌రెడ్డి, శార్వాణి దంపతులు, పచ్చిపాల ఫణికుమార్‌రెడ్డి , స్వర్ణలత దంపతులు, పూనూరు వెంకటరమణారెడ్డి నిర్మలమ్మ దంపతులు వ్యవహరించారు. రుత్వికులు పరాంకుశం రాఘవాచార్యులు, నాగరాజు స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంధ్ర స్వామి, భక్తులు ఉన్నారు.

## సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళుతున్న కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, జులై 6, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 17వ డివి జన్, వెలగచెట్టు సంఘంలో సు పరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్ళి వారికి తొలి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృధి సంక్షేమం పనులను వివరి స్తూ, వారి సమస్యలను తెలుసుకున్న టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి. సంవత్సర కాలంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభు త్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల కు వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి, వారికి అందు తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకు న్నా మన్నారు. పెన్షన్, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాలు అందాయని రూరల్ టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి ప్రజలు తెలియజేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ సాబీర్‌ఖాన్, 17వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు ఊటూకూరు దత్తాత్రేయ, టిడిపినాయకులు పట్రంగి అజయ్, సుధాకర్ రెడ్డి, ఉప్పల వెంకటేశ్వర్లు, వల్లం విజయ్, నరసింహ, నాగరాజు, బట్టా గిరిధర్, చెంచురామయ్య, మస్తానయ్య, బాబు, మస్తాన్, వెంకటేష్, చిరంజీవి, కిష్టయ్య, రవణమ్మ,బుజ్జమ్మ, పాల్గొన్నారు.

## సాయినాధునికి అభిషేక పూజలు



**కోవూరు జులై 6 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహ దారిలో వెలసి ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో 23వ గురు పూర్ణిమ సప్తాహ మ హోత్సవ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ ఉత్సవాలను పురస్క రించుకుని ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో పంచా మృతాభిషేకం, సాయిసహస్ర నా మార్చన కార్యక్రమాలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్ర మాలను కన్నులపండువగా చేపట్టారు. ఈ సందర్భంగా సాయినామ సంకీర్తనలు, సత్సంగ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనం తరం అన్నప్ర సాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కె. యోగితారెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.ఆలయ వ్యవస్థాపకురాలు పచ్చిపాల సుజాత, ఫౌండర్ ట్రస్టీ పచ్చిపాల గోపాల్‌రెడ్డి, ధర్మకర్తలు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, పచ్చిపాల మల్లికార్జున్‌రెడ్డి, ఉన్నారు.

## అపరిశుభ్రత చెంత.. మంచినీటి బావి
### - భయాందోళనతో గ్రామ ప్రజలు



**సైదాపురం, జులై 6 ,ప్రభాతవార్త** ఆ గ్రామ ప్రజలకు ఆ భావి నీరే తాగునీరు అవసరాలు తీర్చేది. అయితే బావిలో ఉన్న నీరు అపరిశుభ్రతతో పాచిపట్టి మురికినీటితో ఉండటంతో ఆ నీరు తాగితే ఎప్పుడు ఏ రోగాలో వస్తాయోనని గ్రామ ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. మండలంలోని తిప్పిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న తోకలపూడి గ్రామంలో ఉన్న సురక్షిత మంచినీటి పథకం భావి పరిశుభ్రత లేకుండా తాగునీరు పాచిపట్టి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో ఆ మురికి నీరే తాగునీరు కావడంతో గ్రామ ప్రజలు పలు అనారోగ్యాలకు గురవుతున్నామని భయాందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఈ గ్రామంలో సుమారు 70కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే వారికి తాగునీరు ఎద్దడి తీర్చేం దుకు అధికారులు భావిని ఏర్పాటు చేశారు. కాని కొన్ని నెలలుగా బావిలో నీటిలో కప్పలు, పాములు, విష పురుగులతో పాటు పాచిపట్టి దుర్గంధం స్థితిలో ఉండటంతో ప్రజలు ఆ నీరు తాగాలంటే భయాం దోళన చెందుతున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులకు, మండల స్థాయి అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా కనీసం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఈ బావి నీరు తాగి అనేక రోగాలకు గురయ్యామని, అప్పుడు అధికారులు వచ్చి హడావుడి చేసి నీటిని ఎటువంటి శుభ్రం చేయకుండా వెళ్లిపో యారని వారు తెలి పారు. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు స్పం దించి బావిని పరిశుభ్రం చేసి ఎటువంటి అనారోగ్యాలకు గురి కాకుండా గ్రామస్తులను కాపాడాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్ కుమార్‌ను వివరణ కోరగా.. సోమవారం బావిని పరిశీలించి బ్లీచింగ్, క్లోరినేషన్ చేయించి పరిశుభ్రం చేయిస్తానని ఆయన తెలిపారు.







## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**చేజర్ల, జులై 6 ,ప్రభాతవార్త** రాష్ట్ర పేద ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారని మండల తెలుగుదేశం పార్టీ నాయకులుతెలిపారు. ఆది వారం సుపరిపాలన తొలిఅడుగు కార్య క్రమం రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆనంరామ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రమైన చేజర్ల, తిమ్మాయపాలెం గ్రామాల్లో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రావి పెంచలరెడ్డి, రావి లక్ష్మీ, నర్సా రెడ్డి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన పథకాల గురించి వివ రించారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు తీసుకున్నటువంటి లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బోడిపాడు మాజీ సర్పంచ్ షేక్ మస్తాన్, షేక్ మునీర్ భాష, హసన్‌భాష, భారత్ మహాసేన నాయకుడు జువ్విగుంట బాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదోతరగతి పరీక్షలో గిరిజన బాలికల ప్రతిభ
### అభినందనీయం సోమిరెడ్డి



**మనుబోలు జులై 6 ప్రభాతవార్త** సర్వేపల్లి నియెజకవర్గం పదో వతరగతి పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించిన గిరిజన విద్యార్థు లను శాసనసభ్యులు సో మిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డి, మను బోలు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని కంటేపల్లి మౌనిక 570 మార్కులు సాధించినందుకు గాను వారికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు ప్రోత్సహకాన్ని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మరియు సోమిరెడ్డి శృతిరెడ్డి అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విద్యార్థులను ప్రోత్సహించి ఉత్తమ ఫలితాలు సాదనకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయుల్ని అభినందించారు. గిరిజన బాలికలు 90 పైగా మార్కులు సాధించడం మంచి లక్ష్యాలతో ముందుకు సాగడమేనని అన్నారు. ప్రతి గిరిజన బిడ్డ బాగా చదవాలని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక దృష్టి పెట్టి గిరిజనుల కోసం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సుపరిపాలన తొల అడుగులో అర్జున్‌రెడ్డి ముమ్మర పర్యటన



**బుచ్చి జులై 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని 6 వవార్డులో సుపరి పాల నకు తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనయు డు అర్జున్‌రెడ్డి నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందించిన సంక్షేమపథకాలను ప్రజల కు వివరించారు. వార్డులో జరగబోయే అభివృద్ధి పనులు తెలియజేశారు. తొలుత పీర్ల చావిడిలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివా సులు ,వింజం రామా నాయుడు మాట్లాడుతు రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి సమపాళ్ళలో జరుగుతున్నాయని అన్నారు. నియో జకర్గంలో ఎక్కడ అవినీతి అక్రమాలకు తావు లేకుండా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సారద్యంలో అభివృద్ధి జరుగు తుందన్నారు. 6 వవార్డులో గతంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. రాబోయే రోజులలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నామి తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు మోర్ల మురళీ, రహమత్, సందాని, మాజీ ఎంపిటిసి పర్వీన్ మైనార్టీనాయకులు పాల్గోన్నారు.

## తూర్పుకంభంపాడులో మహిళపై దాడి
### బాధితురాలిపైనే ఫిర్యాదు



**చేజర్ల, జులై6 ,ప్రభాతవార్త** ఓ మహిళపై ఇంటి విషయంలో దాడి చేయడమే కాకుండా, తిరిగి ఆమెపైన పోలీసులకు ఫిర్యాదు చేసి ఉదంతం చేజర్ల మండలం తూర్పు కంభంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఓ గృహానికి వెళ్లే దారికి సంబంధించి మహిళల మధ్య శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. వాస్తవానికి వైసీపీకి చెందిన ఓ మహిళ కూటమికి సంబంధించిన మహిళ ఇంటిలోకి వెళ్లి దాడి చేసి గాయపరిచారు. అంతటితో ఆగక తనపైనే దాడి జరిగిందంటూ చేజర్ల పోలీసు స్టేషన్లో కూటమికి సంబంధించిన మహిళపైనే అక్రమంగా ఫిర్యాదు చేసింది. అనంతరం ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి నానా యాగి చేసింది. కొందరు వైసీపీ నేతలు ఆ వైసీపీ మహిళకే మద్దతు పలికి అక్రమ కేసు బనాయింపుకు విఫలయత్నం చేశారు. ఈ దాడికి సంబంధించి గత ఏడాది ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి గ్రామానికి విచ్చేసి ఆక్రమణకు గురైన దారిని పరిశీలించారు. ఇంటికి వెళ్లే దారిని ఆక్రమించడం సరైన పద్ధతి కాదని ఇక మీద ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని వైసీపీ మహిళను హెచ్చరించారు. అయినప్పటికి ఆ అధికారి ఆదేశా లను బేఖాతరు చేస్తూ ఆ దారిలో వెళ్ళనీయకుండా అడ్డుకుంటున్నదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేయడంతో మండల తహశీల్దార్ తన సిబ్బందితో శుక్రవారం వచ్చి హద్దులు చూపించి దారిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో వైసీపీ మహిళా నేత కూటమి మహిళపై దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పోలీ సులు వాస్తవాన్ని తెలుసుకునేందుకు విచారణ చేపట్టారు. ఇది ఇలా ఉండగా మండలంలోని పలు గ్రామాల్లో వైకాపా నేతల దౌర్జన్యాలు, అక్రమణలు హెచ్చుమీరాయి. ఇటీవల మడపల్లి గ్రా మంలో ఓ వైసీపీ మహిళ పెన్నా పోరంబోకు ప్రభుత్వ భూమిని ఆక్రమించి కబ్జా చేసి సాగు చేసుకుంటున్నది. గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధి.కారులు రంగ ప్రవేశం చేశారు. మహిళ ఆక్రమించినది ప్రభుత్వ భూమి, ఇందులో ఎవరు ప్రవేశించ రాదని రెవెన్యూ అధికారులు ఆ భూమి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ వైసీపీ మహిళల మండల వైసీపీ నేతల మద్దతుతో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును సైతం తొలగించి ఆ అధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తూ అదే భూమిని సాగు చేసుకోవడం కొసమెరుపు. కాగా కొల్లపనాయుడుపల్లి గ్రామంలో సైతం ఇదే తరహా తంతు కొనసాగింది. ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన భూమిని అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు కబ్జా చేయడం గమనార్హం. అయితే గ్రామస్తులు కొందరు విషయాన్ని మండల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడంతో పాటు ఆ గ్రామస్తులు పైన సదరు వైసీపీ నేత అక్రమ కేసులు బనాయించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేజర్ల మండలంలో వైసీపీ నేతల ఆగడాలు దౌర్జన్యాలు భూకబ్జాలకు కొదవలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మండలంలోని వైసీపీ నేతల ఆగడాలు దౌర్జన్యాలు భూకబ్జాలు యధాతదంగా కొనసాగుతున్నాయి. వైసీపీ నేతలు అధికారంలో లేకపోయినప్పటికి అధికారంలో ఉన్నట్లు అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. మొగుడిని కొట్టి.. మొగసాల కెక్కిన చందంగా వైసీపీ నేతలు దౌర్జన్యాలు దాడులు చేస్తూ గాయపరుస్తూ బాధితులపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తూ శునకానందం పొందుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు వీటిపై విచారణ జరిపి నిందితులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.